సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 27 । సెప్టెంబర్ । 2024



హుండీ ఆదాయం లెక్కింపు
జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో హుండీ ఆదాయం లెక్కించారు. 90 రోజులకు రూ.6,86,870 ఆదాయం లభించింది.



మది సంబరం.. పశ్చిమ విహారం
పశ్చిమ ఏజెన్సీతో పాటు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాలు ప్రకృతి అందాలతో మైమరపింపజేస్తున్నాయి. 8లో ▸



బాలిక గల్లంతు !
తణుకు మండలం కోనాల గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని వయ్యేరు కాలువలో దూకి గల్లంతైన సంఘటన చోటు చేసుకుంది. 8లో ▸

న్యూస్‌రీల్

చేతన ప్రతిభ

చిన్నారి చేతనను సత్కరిస్తున్న కలెక్టర్

భీమవరం: పిన్న వయసు (8 సంవత్సరాల 2 నెలలు) లోనే 108 సార్లు భగద్గీత పారాయణం చేసిన భీమవరానికి చెందిన బొలిశెట్టి చేతన ఇంటర్నేషనల్ బుక్ **ఆఫ్ రికార్డ్స్‌లో** స్థానం సంపాదించింది. చేతనను గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణి అభినందించారు. చేతన ఏప్రిల్‌లో ఈ రికార్డు సాధించడంతో పా టు మే నెలలో మైసూర్ దత్త పీఠాధిపతి గ ణపతి సచ్చిదానంద స్వామీజీ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకుంది.

ఇసుక వాహనాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి
భీమవరం (ప్రకాశంచౌక్): ఇసుక రవాణా వాహనాల రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో టిప్పర్ల యజమానులతో ఆమె సమావేశయ్యారు. నిబంధనల ప్రకారం ఇసుక రవాణా చేయాలని, టిప్పర్లకు జీపీఎస్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇసుక రవాణాలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌ఓ జె.ఉదయభాస్కరరావు, ఆర్డీఓ పి.ఉమామహేశ్వరరావు, జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి జి.జయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కుళాయి నీరు తాగలేకపోతున్నాం
భీమవరం అర్బన్: గూట్లపాడులో కుళాయిల ద్వారా సరఫరా చేసే నీరు తాగలేకపోతున్నామని టీడీపీ నాయకులు రోడ్డెక్కారు. గురువారం రక్షిత మంచినీటి చెరువులో నీరు పసర్లు బారినపడిందని, మురుగు నీరు కుళాయిల ద్వారా సరఫరా అవుతుందని, శుద్ధి చేసి స్వచ్ఛమైన నీరందించాలని టీడీపీ నాయకులు బొమ్మిడి మధుసూదనరావు, కొల్లు గోపాలకృష్ణ, సీపీఎం మాజీ మండల కన్వీనర్ రేవు రామకృష్ణతో పాటు ఇతర పార్టీల నాయకులు కలిసి పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. కుళాయిల ద్వారా సరఫరా చేసే నీరు శుద్ధి చేయకపోవడంతో తాగలేకపోతున్నామని, స్నానాలు చేస్తే చర్మ వ్యాధు లు వస్తున్నాయన్నారు. నీరు బురదగా ఉండటంతో వంటకు కూడా ఉపయోగపడటం లేదన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చింది మంచి రోజులు వస్తాయనుకుంటే తాగునీరు కూడా ఫిల్టర్ చేయడం లేదని వాపోయారు. స్వచ్ఛమైన నీరందించేలా చర్యలు తీసుకోవాలని కో రారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రేవు మధు, గోవిందరాజు, పి.శ్రీనివాసు, ఆర్ నాగేశ్వరరావు ఉన్నారు.

ఆర్‌డీఓల బదిలీలు
ఏలూరు (మెట్రో): రాష్ట్ర వ్యాప్తంగా డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పలువురు ఆర్‌డీఓలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నర్సాపురం ఆర్‌డీఓ అచ్యుత అంబరీష్‌ను ఏలూరు ఆర్‌డీఓగా నియమించింది. నర్సాపురం ఆర్‌డీఓగా డి.రాజును నియమించింది. మచిలీపట్నం ఆర్‌డీఓ ఎం.వాణిని నూజివీడు ఆర్‌డీఓగా బదిలీ చేసింది. నూజివీడు ఆర్డీవో వై.భవాని శంకరిని తాడేపల్లిగూడెం ఆర్‌డీఓగా నియమించగా, భీమవరం ఆర్‌డీవోగా కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని నియమించింది. ఏలూరు ఆర్‌డీఓ ఖాజావలీని, తాడేపల్లిగూడెం ఆర్డీవో కె.చెన్నయ్యలను ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశించింది. మరో రెండు, మూడు రోజుల్లో మరికొందరు ఆర్‌డీఓలను జిల్లాలో ప్రభుత్వం నియమించనున్నట్టు సమాచారం.

రిజర్వ్ షాపుల పైనా కన్ను


పర్సంటేజీల 'చీర్స్'
- ఉమ్మడి పశ్చిమలో 43 మద్యం దుకాణాలు గౌడ కులస్తులకు..
- రిజర్వ్ షాపులకు పర్సంటేజీలు ఖరారు చేసిన ప్రజాప్రతినిధులు
- హక్కుగా వచ్చే షాపులకు కూడా మామూళ్లు ఏమిటంటూ లబ్ధిదారుల ఆగ్రహం
- భీమవరంలో గౌడ, శెట్టిబలిజల ఆత్మీయ సమావేశం
- మండలాల వారీగా కులస్తులే సిండికేట్‌గా నిర్వహించుకోవాలని నిర్ణయం
- ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తే సీఎంకు ఫిర్యాదు చేయాలని తేల్చిన వైనం



సాక్షి ప్రతినిధి, ఏలూరు: రిజర్వుడ్ మద్యం షాపుల నుంచి పర్సంటేజీల కోసం అధికార పార్టీ ప్రజాప్రతినిధులు టార్గెట్లు ఫిక్స్ చేస్తున్నారు. నియోజకవర్గంలో ఎవరు వ్యాపారం చేసినా కప్పం అనివార్యంగా కట్టాల్సిందే.. దానికి ఇష్టపడినవారే దరఖాస్తులు చేసుకోవాలి.. అలా కాకుండా షాపు తెచ్చుకున్నా మొదటి రోజు నుంచే వేధిస్తామని అధికార పార్టీ నేతలు లిక్కర్ వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేశారు. చివరికి ఉమ్మడి పశ్చిమగోదావరిలో గౌడ కులస్తులకు కేటాయించిన 43 షాపులకు కూడా మామూళ్లు ఇవ్వాల్సిందేననే ఒత్తిళ్ల నేపథ్యంలో కుల సమావేశం నిర్వహించి కీలక తీర్మానాలు చేయడం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.

ఉమ్మడి జిల్లాలో 393 దుకాణాలు

రెండు జిల్లాల్లో కలిపి 393 ప్రైవేటు మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. 10 శాతం కోటాలో భాగంగా గౌడ కులస్తులకు ఏలూరు జిల్లాలో 16, పశ్చిమగోదావరి జిల్లాలో 27 వైన్‌షాపులు కేటాయించడం గమనార్హం. ఈ క్రమంలో పశ్చిమగోదావరి జిల్లాలోని కీలక నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు షాపుల వారీగా ఫిక్సెడ్ పర్సంటేజీలు, షాపుల్లో భాగస్వామ్యాలు ఖరారు చేసి తమ ముఖ్య అనుచరుల ద్వారా సిండికేట్‌తో మంతనాలు నిర్వహిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా లాభాల్లో భారీ పర్సంటేజీలు డిమాండ్ చేస్తుండటంతో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ఇక గౌడ కులస్తులకు కేటాయించే షాపులకు కూడా నియోజకవర్గంలో ఖరారు చేసిన రేట్లను చెల్లించాలన్నదే ప్రజాప్రతినిధుల నుంచి బలంగా వినిపించింది. ఈ సామాజిక వర్గానికి చెందిన కొందరు జిల్లాలో గతంలో మద్యం వ్యాపారంతో పాటు సిండికేట్‌లో కీలకంగా వ్యవహరించారు. తాజాగా మళ్లీ ప్రైవేటు షాపులు వచ్చే నెల వస్తుండటంతో అందరి దృష్టి లిక్కర్ వ్యాపారంపైకి మళ్లింది. దీంతో ప్రజా ప్రతినిధులు భారీగా డిమాండ్ విధించారు.



కీలక తీర్మానాలు
ఈ పరిణామాల క్రమంలో బుధవారం భీమవరంలో గౌడ, శెట్టిబలిజ, శ్రీశయన యాత, ఈడిగ కులస్తుల ముఖ్య సమావేశం నిర్వహించారు. దాదాపు 200 మందికి పైగా పాల్గొన్నారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేసి పలు తీర్మానాలు చేశారు. అనంతరం ముఖ్యులు సమావేశమై రాజకీయ పరిణామాలపై చర్చించారు. ప్రజాప్రతినిధుల డిమాండ్లపై తీవ్రంగా చర్చించి కీలక తీర్మానాలు చేశారు. బీసీలకు రిజర్వ్ అయిన షాపుల్లో రాజకీయం ఉండకూడదని, ఎక్కడా ఒక్క రూపాయి కూడా పొలిటికల్ మామూళ్లు ఇవ్వకూడదని మండలంలోని ముఖ్యులంతా కలిసి సిండికేట్‌గా ఏర్పడి షాపులు నిర్వహించుకోవాలని తీర్మానాలు చేశారు. ఈ అంశాలను పితానికి వివరించగా ఎమ్మెల్యేలు డబ్బులు డిమాండ్ చేస్తే నేరుగా ముఖ్యమంత్రికే ఫిర్యాదు చేద్దాం.. ఎవరికీ రూపాయి ఇవ్వడానికి వీల్లేదంటూ స్పష్టం చేసినట్టు సమాచారం. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత మరోసారి సమావేశమై కార్యాచరణ ప్రకటించుకోవాలని నిర్ణయించినట్టు తెలిసింది. పార్టీ కోసం పని చేసిన వారి వద్ద కూడా ఎమ్మెల్యేలు పర్సంటేజీలు అడగడం దారుణమంటూ పలువురు అభిప్రాయం వ్యక్తం చేసినట్టు సమాచారం.

రేపు జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో పూజలు
వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు



నరసాపురం: స్వార్థ రాజకీయాల కోసం తిరుమల ప్రాభవాన్ని, శ్రీవారి లడ్డూ ప్రసాదం విశిష్టతకు అప్రతిష్ట పాలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేయాలని ఈ నెల 28న శనివారం జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు పిలుపునిచ్చారు. రాజకీయాల కోసం కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతినేలా చోటు చేసుకుంటున్న పరిణామాలు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు బలంగా తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ అధినేత జగన్ పిలుపు మేరకు ఆలయాల్లో పూజల కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులంతా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శ్రీవారి లడ్డూలో కల్తీ జరిగిందనే అసత్య ప్రచారానికి సీఎం చంద్రబాబు తెరలేపారన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి ఇలా మత విభేద రాజకీయాలు చేయడం దారుణమని అన్నారు. రాజకీయాల్లోకి కలియుగ దైవం వేంకటేశ్వరుడిని తీసుకువచ్చి చంద్రబాబు తీరని అపచారం చేశారన్నారు. సూపర్ సిక్స్ అంటూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ హామీల అమలు పక్కన పెట్టి ప్రజల దృష్టి మరల్చడానికి ఇలాంటి దుర్మార్గపు ప్రచారాలు చేస్తుందని మండిపడ్డారు. చంద్రబాబు పాపం ప్రక్షాళన కావాలని దేవతలను వేడుకుంటూనే, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరుగుతున్న దుష్ప్రచారంలో నిజాలను ప్రజలకు వివరించే ప్రయత్నం పార్టీ శ్రేణులు చేయాలని ప్రసాదరాజు పిలుపునిచ్చారు.

రఘురామకృష్ణరాజును సస్పెండ్ చేయాలి


పాలకొల్లులో మాలమహానాడు ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న దృశ్యం


భీమవరంలో మాలసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన

మాల సంఘాల నిరసనలు
పాలకొల్లు అర్బన్: ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అంబేడ్కర్ ఫ్లెక్సీని చించి, అవమానించిన ఘటనలో ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని, రఘురామకృష్ణరాజును తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ డిమాండ్ చేశారు. గురువారం పాలకొల్లు హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి గాంధీబొమ్మల సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. గవర్నర్ జోక్యం చేసుకుని రఘురామకృష్ణరాజు ఎమ్మెల్యే పదవిని రద్దు చేయాలని రాజేష్ డిమాండ్ చేశారు. జిల్లాలో, రాష్ట్రంలోని పలు స్టేషన్లలో ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పీవీ రావు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాద్, జిల్లా అధ్యక్షుడు గుండె నగేష్, నాయకులు విప్పర్తి ప్రభాకరరావు, మోకా నరసింహరావు, సరెళ్ల శ్రీనివాస్, పాలపర్తి కృపానాథ్ తదితరులు పాల్గొన్నారు.


బహిరంగ క్షమాపణ చెప్పాలి

భీమవరం: కాళ్ల మండలం ఏలూరుపాడులో అంబేడ్కర్ ఫ్లెక్సీని అక్రమంగా తొలగించిన ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు బహిరంగ క్షమాపణ చెప్పాలంటూ గురువారం దళిత సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పండు అశోక్‌బాబు మాట్లాడుతూ ఏలూరుపాడులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రఘురామకృష్ణరాజు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. ఎమ్మెల్యే వైఖరికి నిరసనగా ఈనెల 28న భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామన్నారు. కోనా జోసఫ్, తాళ్లూరి మధు, గంటా సుందరకుమార్, గుమ్మాపు సూర్యవరప్రసాద్, కాటం స్టాన్లీ పాల్గొన్నారు.

హోల్‌సేల్ మార్కెట్‌లో ధరలు (10 కిలోలు రూ.లలో)

టమాటా	బీరకాయలు	నల్ల వంకాయ	దోసకాయలు	కాకర కాయలు	క్యారెట్	బీన్స్	ఆకాకర
360	300	400	250	300	300	600	800
బెండకాయలు	**తెల్ల వంకాయ**	**పచ్చిమిర్చి**	**దొండకాయలు**	**క్యాబేజీ**	**బీట్‌రూట్**	**చిక్కుడు**	**క్యాప్సికం**
200	600	200	250	150	250	900	600

వెజ్ ట్రబుల్స్



- కూరగాయలకు కృత్రిమ కొరత
- హోల్‌సేల్‌లో తగ్గినా.. రిటైల్‌లో ధరల మోత
- వినియోగదారుల జేబులకు చిల్లు
- పట్టించుకోని అధికారులు

తాడేపల్లిగూడెం: వంకాయలు కిలో రూ.120.. చిక్కుళ్లు రూ.160.. క్యాబేజీ రూ.80.. దొండకాయలు రూ.60.. దోసకాయలు రూ.60.. ఇలా ఏ రకం కూరగాయ ధర అడిగినా వినియోగదారులకు షాక్ తగిలేలా సమాధానాలొస్తున్నాయి. వరదల కారణంగా దూరప్రాంతాల నుంచి కూరగాయలు రావడం, మార్కెట్లకు తక్కువగా సరుకు రావడం వంటి కారణాలతో ఏ రకం అడిగినా 'సెంచరీ' మార్కు దిశగా ధరలు ఉన్నాయి. జిల్లాలోని లంక ప్రాంతాల్లో వరద ప్రభావంతో దొండకాయలు, పొట్లకాయలు, దోసకాయలు వంటి వాటి ధరలు పెరిగాయి. కర్ణాటక ప్రాంతం నుంచి క్యారెట్ రావడంతో వాటి ధరకు రెక్కలు వచ్చాయి. బీట్‌రూట్, క్యాప్సికం, బీన్స్ అదే మార్గంలో నడిచాయి. తెల్ల వంకాయలు, పందిరి బీర ధరలు కిలో రూ.120 వరకు చేరి భయపెట్టాయి. పచ్చిమిర్చి సైతం కిలో వంద మార్కు దాటగా, అల్లం కొత్తది రూ.120, పాతది రూ.200 టచ్ చేసింది. కొత్తిమీర కట్ట కూడా రూ.60 చేరి రికార్డు సృష్టించింది. వీటితో పాటు ఉల్లి ధరలు రూ.50 దాటి పరుగులు తీశాయి. రెండు రోజుల క్రితం వరకు ధరలు ఇలానే ఉన్నా బుధవారం నుంచి కూరగాయల ధరలు తగ్గుముఖం పట్టాయి. అయితే రిటైల్ మార్కెట్‌లో వ్యాపారులు ఇంకా కృత్రిమ కొరతను సాకుగా చూపి పాత ధరలకే విక్రయిస్తున్నారు. హోల్‌సేల్ మార్కెట్‌లో అన్నిరకాలు 40 శాతం వరకు ధరలు తగ్గినా రిటైల్ వ్యాపారులు మాత్రం తగ్గించడం లేదు. హోల్‌సేల్ ధరలకు 20 శాతం లాభం వేసుకుని రిటైల్ మార్కెట్‌లో విక్రయించాల్సి ఉండగా పాత ధరలకే కూరగాయలను విక్రయిస్తుండటంతో వినియోగదారుల జేబులకు చిల్లుపడుతోంది. వీటిని నియంత్రించాల్సిన అధికారులు మిన్నకుండా ఉన్నారు.

హిందుత్వం కోసం కాదు.. పవన్ ప్రసన్నం కోసం..

- పేరుకే పాదయాత్ర.. తెరవెనుక రాజకీయ స్టంట్లు
- అఖండ దీపాన్ని పక్కనబెట్టి..
- పాదయాత్రలో మాయమై.. పవన్ వద్ద ప్రత్యక్షం


ఉదయం.. శ్రీవారి ఆలయం వద్ద అఖండ దీపంతో సాయంత్రం.. మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో పవన్ కల్యాణ్‌తో అవినాష్ దేవి చంద్ర

ద్వారకాతిరుమల: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం అపవిత్రమైందంటూ కొందరు హిందుత్వాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయ స్టంట్లు చేస్తున్నారు. తమ పార్టీల అధినేతల దృష్టిలో పడేందుకు లడ్డూ ప్రసాదాన్ని పావులా వాడుకుంటున్నారు. ఒక ట్రస్ట్ ఫౌండర్ చేపట్టిన పాదయాత్ర ఈ కోవకే చెందినదని కొందరు అంటున్నారు. ప్రస్తుతం ఇది వివాదాస్పదమైంది. వివరాల్లోకి వెళితే.. శ్రీ తారా వారాహి లోక కల్యాణార్థ సేవా భారత్ ట్రస్ట్ ఫౌండర్ బచ్చు అవినాష్ దేవిచంద్ర కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి తిరుమలకు పాదయాత్ర చేస్తున్నట్టు ప్రకటించారు. దీనిలో భాగంగా ఆయన గురువారం ఉదయం 9.30 గంటల సమయంలో ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. శిరస్సుపై ఉన్న అఖండ దీపంతో స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన పాదయాత్ర ఇక్కడ నుంచి ఏలూరు, హనుమాన్ జంక్షన్ మీదుగా విజయవాడ దుర్గమ్మ ఆలయానికి చేరుకుంటుందని చెప్పారు. ఇదిలా ఉంటే అవినాష్ దేవి చంద్ర సాయంత్రానికి మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ప్రత్యక్షమై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వద్ద దర్శనమిచ్చారు. సోషల్ మీడియాలో కనిపించిన ఈ దృశ్యాలు పలువురిని కంగుతినేలా చేశాయి. మహా పాదయాత్ర చేస్తున్న వ్యక్తి ఆ పాదయాత్రను పక్కన పెట్టి పవన్ కల్యాణ్ వద్దకు వెళ్లడం ఏమిటని ముక్కున వేలేసుకున్నారు.

గాంధీతత్వం.. శాంతికి మార్గం







సీనియర్స్ విభాగంలో.. ప్రథమ, ద్వితీయ,తృతీయ స్థానాల్లో నిలిచిన చిత్రాలు (వరుసగా)

చిత్రలేఖన పోటీలకు విశేష స్పందన
భీమవరం: జాతిపిత గాంధీజీ 156వ జయంతిని పురస్కరించుకుని సర్వోదయ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ తత్వంపై ఆన్‌లైన్ చిత్రలేఖన పోటీలకు అనూహ్య స్పందన వచ్చింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతల వివరాలను సర్వోదయ మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు గురువారం వెల్లడించారు.

సీనియర్స్ విభాగంలో.. టెఫిని (భీమవరం), ఎ.శ్రీవర్షిణి (మేడపాడు), ఎస్.ప్రజ్ఞా తపస్విరెడ్డి (నిడదవోలు).

జూనియర్స్ విభాగంలో.. సీహెచ్ భావిష్ (వేలివెన్ను), టి.భార్గవ్ (ఏలూరు), గాయత్రి (శనివారపుపేట).

సబ్ జూనియర్స్ విభాగంలో.. పి.మోక్షిత (దర్భగూడెం), ఏవీ సాయిస్వాగత్ (నందమూరుగరువు), కె.గంగాహామిని (దండగర్ర)

కళాశాలల విభాగంలో.. శ్యామల గౌరి (భీమవరం), నిహారిక (ఏలూరు), కె.హర్ష (బుట్టాయగూడెం) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. పశ్చిమగోదావరి జిల్లా విజేతలకు అక్టోబర్ 1న భీమవరంలో క్విట్ ఇండియా స్థూపం వద్ద, ఏలూరు జిల్లా విజేతలకు 2న పెదనిండ్రకొలనులోని మహాత్మాగాంధీ భవనం వద్ద, తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని విజేతలకు 2న మల్లవరంలోని గాంధీ ఆశ్రమంలో బహుమతులు అందిస్తామన్నారు.

దర్భరేవు ఇంజనీరింగ్ అసిస్టెంట్ సస్పెన్షన్
భీమవరం(ప్రకాశం చౌక్): దర్భరేవు గ్రామానికి చెందిన ఇంజనీరింగ్ అసిస్టెంట్ కొల్లాటి లీలాకృష్ణను కలెక్టర్ చదలవాడ నాగరాణి సస్పెండ్ చేశారు. గ్రామంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిర్మిస్తున్న గృహ నిర్మాణాలకు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఇళ్లకు చెల్లింపులు జరిగాయనే గ్రామస్తుల ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకున్నారు. దీనిపై విచారణ అనంతరం వాస్తవమే అని నివేదిక అందడంతో సస్పెండ్ చేశారు.

ధాన్యం కొనుగోళ్లకు సాంకేతిక శిక్షణ
భీమవరం: ధాన్యం కొనుగోలు సాంకేతిక శిక్షణా తరగతులను ఆర్ఎస్‌కే సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. డివిజన్ల వారీగా మూడు రోజుల పాటు స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో చేపట్టిన శిక్షణా తరగతులను గురువారం ఆయన ప్రారంభించారు.

క్లుప్తంగా

సచివాలయ సిబ్బందిపై పితాని అక్కసు


ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే పితాని

పెనుగొండ: సచివాలయ ఉద్యోగులపై ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అక్కసు వెళ్లగక్కారు. గురువారం పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం పెనుమంచిలిలో జరిగిన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వంలో వలంటీర్లు సేవలు చేయడం మాని పార్టీ కార్యక్రమాలు చేపట్టడంతో వారు గాలిలో కలసిపోయారన్నారు. అదే తీరులో సచివాలయ సిబ్బంది వ్యవహరించారన్నారు. సచివాలయ సిబ్బంది ఎవరూ కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేయలేదంటూ విమర్శించారు. సచివాలయ ఉద్యోగులు పనితీరు మార్చుకోకపోతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. జెడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్ బాబు, సర్పంచ్ గణేషుల శేషవేణి సుబ్బారావు, కేతా మీరయ్య, పార్టీ నేతలు పాల్గొన్నారు.

మోడరన్ పెంటాథ్లాన్ క్రీడా పోటీలకు 8 మంది ఎంపిక

తణుకు అర్బన్: పశ్చిమ గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక బెల్‌వెడర్ ఇంటర్నేషనల్ స్కూలు క్రీడా ప్రాంగణంలో మోడరన్ పెంటాథ్లాన్ (రన్నింగ్, స్విమ్మింగ్) అండర్ 17 బాల బాలికల జిల్లా జట్ల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఈ పోటీలను స్కూలు ప్రిన్సిపాల్ వినీత శామ్యూల్ ప్రారంభించారు. 90 మంది క్రీడాకారులు సెలక్షన్స్‌లో పాల్గొనగా 8 మందిని జిల్లా జట్లకు ఎంపికచేశామని, వీరు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఫెడరేషన్ సెక్రటరీ పీఎస్ మల్లేశ్వరరావు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు సంకు సూర్యనారాయణ, ఎం.నాగరాజ్యం, కె.సుబ్బారావు, వి.సరస్వతి, బి.చాంద్ బాషా పోటీలను పర్యవేక్షించారు.

30న హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపికలు

వీరవాసరం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హ్యాండ్ బాల్ జిల్లా జట్ల ఎంపికలు జరగనున్నాయని ఫెడరేషన్ కార్యదర్శి పీఎస్ఎన్ మల్లేశ్వరరావు గురువారం తెలియజేశారు. ఈనెల 30న ఏలూరు ఇండోర్ స్టేడియం గ్రౌండ్స్ నందు అండర్-14, అండర్-17 బాలబాలికల హ్యాండ్ బాల్ జిల్లా జట్ల ఎంపికలు చేస్తామన్నారు. ఈ ఎంపికల్లో పాల్గొనే విద్యార్థులు ఎంట్రీ ఫారం, మిడ్ డే మీల్స్ అటెండెన్స్‌లతో ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

- పాపికొండల అందాలు.. అపురూప దృశ్యాలు
- అరకుకు తామేమీ తక్కువ కాదంటున్న అడవితల్లి అందాలు
- ఆహ్లాదభరితం గోదావరి నదిపై బోటు విహార యాత్ర
- భక్తి, వినోదం పంచుతున్న పుణ్యక్షేత్రాలు
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం



పాపికొండల నడుమ బోటు ప్రయాణం

మది సంబరం.. పశ్చిమ విహారం

బుట్టాయగూడెం : జాలువారుతున్న సెలయేటి జలపాతాలు.. కొండలను తాకుతున్న మేఘాలు.. పాపికొండల సోయగాలు.. గోదావరి నడుమ బోటు ప్రయాణం.. ఆధ్యాత్మిక క్షేత్రాలు.. ఇలా పశ్చిమ ఏజెన్సీలోని ప్రకృతి అందాలు సోగసు చూడతరమా.. అన్నట్టుగా ఉంటాయి. పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంతో పాటు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రకృతిలో మమేకమైన ఎన్నో ప్రాంతాలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా వాటి గురించి తెలుసుకుందాం.

అబ్బురపరిచేలా...

బుట్టాయగూడెం మండలంలోని కామవరం సమీపంలో గల అటవీ ప్రాంతంలో సహజసిద్ధంగా వెలసిన గుబ్బల మంగమ్మ గుడి ఆధ్యాత్మికతను సంతరించుకోవడంతో పాటు ఆయా ప్రాంతాల్లో అందాలు అబ్బురపరచేలా కనువిందు చేస్తాయి. అలాగే ముంజులూరు సమీపంలోని ఏనుగుతోగు జలపాతం, పాపికొండల సమీపంలోని జలతారు వాగుల ప్రవాహ దృశ్యాలు మదిని దోచుకుంటాయి. అలాగే పేరంటాలపల్లి శివక్షేత్రం కూడా పర్యాటక ప్రదేశంగా ఉంది. ఈ ప్రాంతంలో గిరిజ**నులు తయారు చేసిన వెదు**రు వస్తువులకు ఆదరణ **ఎక్కువగా ఉంటుంది.**


పాపికొండల సమీపంలో అటవీశాఖ వారు **నిర్మించిన కార్టేజ్**లు వసతి ఇలా..

పట్టిసీమ క్షేత్రం

పర్యాటకులు తప్పనిసరిగా సందర్శించవలసిన శివ క్షేత్రం పట్టిసీమ. గోదావరి మధ్యలో ఉన్న పట్టిసీమ చిన్న లంక మాదిరి ప్రదేశంలో వీరభద్రస్వామి ఆలయం ప్రకృతి సుందరంగా ఉంటుంది. చుట్టూ గోదావరి మధ్యలో ఆలయం పర్యాటకుల మదిని దోచుకుంటుంది. శివరాత్రికి ఇక్కడికి లక్షలాది మంది భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. మిగిలిన రోజుల్లో విహారయాత్రకు వచ్చేవారు గోదావరిలో పడవపై వెళ్లి స్వామివారిని దర్శించుకుంటారు. గోదావరి తల్లి ఒడిలో ఉండే ఈ శివ క్షేత్రం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుంది.

మదిని దోచే పాపికొండల అందాలు

చుట్టూ ఎత్తయిన పర్వత శ్రేణులు.. వాటి మధ్యలో గలగలా గోదావరి ప్రవాహం. ఆ కొండల్లో పొడవాటి పచ్చటి వృక్షాలు, పక్షుల కిలకిల రావాలు, ఎటుచూసినా ప్రకృతి రమణీయత, సుందర దృశ్యాల సమాహారం పాపికొండల విహారం. అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల నడుమ తూర్పు కనుమల్లో దట్టమైన అడవుల్లో కూడిన పర్వత శ్రేణి పాపికొండలు. ఇంతటి విశిష్టత కలిగిన పాపికొండల అందాలను వీక్షించేందుకు ప్రతి ఏటా ప్రకృతి ప్రేమికులు పాపికొండల యాత్రకు వస్తూ ఉంటారు. పాపికొండల సందర్శనకు గోదావరి నదిపై బోటు ప్రయాణం ఎంతో అనుభూతిని కలిగిస్తుంది. పాపికొండల విహార యాత్రకు వచ్చే పర్యాటకుల కోసం అటవీశాఖ అధికారులు 15 కార్టేజీల ఏర్పాటుకు కృషి చేశారు. ప్రస్తుతం 5 కార్టేజీలు అందుబాటులో రాగా మిగిలినవి నిర్మించేందుకు కృషి చేస్తున్నారు. వీటితోపాటు శివగిరి సమీపంలో కూడా కార్టేజీలను నిర్మిస్తున్నట్లు అధికారులు చెప్తున్నారు.

పోలవరం ప్రాజెక్టు

ఆంధ్రుల జీవనాడిగా పిలవబడుతున్న పోలవరం ప్రాజెక్టు పోలవరం మండలంలోనే ఉంది. అల్లూరి జిల్లా, ఉమ్మడి ఏలూరు జిల్లాల కొండల మధ్యన ఈ పోలవరం ప్రాజెక్టు నిర్మించడంతో ప్రాజెక్టును తిలకించేందుకు ఇటీవల పర్యాటకుల సంఖ్య కూడా పెరిగింది. పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో పర్యాటకుల మనసు దోచే అనేక ప్రదేశాలు ఉన్నాయి. తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ ఒక్కసారైనా ఈ ప్రాంతాలను సందర్శించాల్సిందే.


పాపికొండల సమీపంలో నిర్మించిన కార్టేజీలు


గుబ్బల మంగమ్మతల్లి గుడిపై నుంచి ప్రవహిస్తున్న నీరు


పట్టిసీమ శివ క్షేత్రం

పాదచారులను ఢీకొన్న కారు

ఒకరి మృతి.. ఇద్దరికి గాయాలు


కె.దుర్గారావు (ఫైల్)

తాడేపల్లిగూడెం అర్బన్ : రోడ్డు పక్కనుంచి నడిచి వెళుతున్న ముగ్గురు వ్యక్తులను వెనుక నుంచి కారు ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. తాడేపల్లిగూడెం పట్టణంలో ఈ ప్రమాదం చోటుచేసుకొంది. పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం అర్ధరాత్రి సమయంలో పట్టణానికి చెందిన కరణం దుర్గారావు (30), యడ్ల నాగేశ్వరరావు, మజ్జి దుర్గాప్రసాద్ విజయటాకీస్ సెంటర్ నుంచి పెంటపాడు వైపు నడిచి వెళ్తున్నారు. రేలంగి చిత్రమందిర్ సెంటర్ వద్దకు వచ్చేసరికి ఏపీ 21 బీఎక్స్ 1345 నెంబరు షిఫ్ట్‌డిజైర్ కారు ఈ ముగ్గురిని వెనుకనుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కరణం దుర్గారావు అక్కడికక్కడే మృతి చెందాడు. యడ్ల నాగేశ్వరరావుకు తీవ్రగాయాలు కాగా మజ్జి దుర్గాప్రసాద్‌కు స్వల్పగాయాలయ్యాయి. వీరిని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా యడ్ల నాగేశ్వరరావును మెరుగైన వైద్యం నిమిత్తం రాజమండ్రి తరలించారు. కరణం దుర్గారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు నుంచి ఇద్దరు వ్యక్తులు పరారు కాగా ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు పిల్లలు సహా మహిళ అదృశ్యం


అదృశ్యమైన దుర్గాభవాని, నాగవిశాల్, హరికృష్ణ

తణుకు: తన ఇద్దరు పిల్లలతో సహా మహిళ అదృశ్యమైన ఘటన తణుకు పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ ఎస్సై కె.చంద్రశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తణుకు మండలం పైడిపర్రు గ్రామానికి చెందిన మడ దుర్గాప్రసాద్, దుర్గాభవానీలకు ఇద్దరు పిల్లలు. తణుకు సజ్జాపురంలోని ఆదర్శ స్కూలులో పిల్లలు చందు నాగవిశాల్, హరికృష్ణ చదువుతున్నారు. బుధవారం ఉదయం పిల్లలను స్కూలుకు దించే క్రమంలో తన సమీప బంధువు ఆకుల దుర్గాసంతోష్ బైక్‌పై స్కూలుకు వచ్చారు. ముగ్గురిని స్కూలులో దించిన సంతోష్ వెళ్లిపోయారు. అక్కడి నుంచి స్కూలుకు వెళ్లకుండా ఇద్దరు పిల్లలతో సహా దుర్గాభవాని అదృశ్యమైంది. భర్త దుర్గాప్రసాద్, బంధువులు చుట్టుపక్కల వెదికినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లి కృష్ణకుమారి గురువారం తణుకు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కాలువలో దూకిన బాలిక గల్లంతు?


తానంకి శ్రావణి

తణుకు : తణుకు మండలం కోనాల గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థి కాలువలో దూకి గల్లంతైన ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తానంకి శ్రావణి ముద్దాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తగరతి చదువుతోంది. గురువారం యథావిధిగా స్కూలుకు వచ్చిన శ్రావణి బ్యాగు అక్కడే ఉంచి బయటకు వెళ్లిపోయింది. హాజరువేస్తున్న సమయంలో శ్రావణి లేకపోగా పుస్తకాల బ్యాగు అక్కడే ఉండటంతో అనుమానం వచ్చిన ఉపాధ్యాయులు ఆమె కోసం గాలించారు. అయితే ముద్దాపురం నుంచి దువ్వ వెళ్లే రోడ్డులో మూలలంక వయ్యేరు వంతెన వద్ద శ్రావణి చెప్పులు ఉండటంతో ఆమె కాలువలో దూకినట్లుగా భావిస్తున్నారు. పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని కాలువలో గాలింపు చేపట్టారు. బాలిక తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై జీఎస్‌వీ మూర్తి అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గాలింపు చర్యలు చేపట్టిన ఫైర్, పోలీసు సిబ్బంది

హెడ్ మాస్టర్ హెచ్చరించడంతో..

గురువారం ఉదయం స్కూలుకు వచ్చిన శ్రావణిను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం హెచ్చరించడంతోనే మనస్తాపం చెంది ఉంటుందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. బుధవారం శ్రావణి స్కూలు నుంచి ఇంటికి వెళ్లే సమయంలో యువకుడి బైక్ ఎక్కిందంటూ తోటి విద్యార్థులు గురువారం హెచ్ఎం దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన మందలించినట్లు చెబుతున్నారు.

గోదావరిలో మృతదేహం లభ్యం

భీమవరం వాసిగా గుర్తింపు


నాయుడు సుబ్రహ్మణ్యం (ఫైల్)

కొవ్వూరు: మండలంలోని మద్దూరులంక గోదావరి బ్యారేజి గేట్ల వద్ద నాయుడు సుబ్రహ్మణ్యం (33) అనే యువకుడి మృతదేహాన్ని బుధవారం రాత్రి కొవ్వూరు రూరల్ పోలీసులు గుర్తించారు. ఆ యువకుడు ఈనెల 24న రోడ్డు కం రైలు వంతెనపై నుంచి గోదావరి నదిలోకి దూకి గల్లంతయ్యాడు. మోటార్ సైకిల్‌పై వచ్చిన సుబ్రహ్మణ్యం వంతెన 127 పిల్లర్ వద్ద బైక్‌ను విడిచి పెట్టారు. మోటారు సైకిల్‌పై 'జై గ్రంధి సిద్ధం' అనే స్టిక్కర్ అతికించి ఉంది. బైక్ నంబర్ ప్లేట్ ఆధారంగా గల్లంతైన వ్యక్తి భీమవరానికి చెందిన వాడిగా అప్పట్లో కొవ్వూరు పట్టణ పోలీసులు గుర్తించారు. విచారణ అనంతరం మృతుడు భీమవరంలోని మోటుపల్లివారి వీధికి చెందిన కార్పెంటర్ నాయుడు సుబ్రహ్మణ్యంగా రూరల్ పోలీసులు గురువారం తెలిపారు. సుబ్రహ్మణ్యానికి భార్యతో పాటు సత్యజ్యోతి, జగదీశ్వరి అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం కొంతకాలంగా భీమవరంలో ఉంటున్నాడు. వైఎస్సార్ సీపీలో చురుకైన కార్యకర్త అని చెబుతున్నారు. తల్లిదండ్రులను చూసేందుకు ఏడిద వెళ్లిన సుబ్రహ్మణ్యం తిరిగి బైక్‌పై భీమవరం వెళుతూ మార్గమధ్యలో ఈ ఆఘాయిత్యానికి పూనుకున్నట్టు భావిస్తున్నారు. మృతుడి తండ్రి నాయుడు వీరభద్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ హెడ్ కానిస్టేబుల్ బి.సత్యనారాయణ తెలిపారు.

క్రీడల్లో సత్తాచాటుతున్న విద్యార్థులు

- ఎస్‌జీఎఫ్‌లో జిల్లాస్థాయికి ఎంపికైన వైనం
- విద్యార్థుల్లో క్రీడలపై పెరిగిన ఆసక్తి
- ఆడుదాం ఆంధ్రతో గత జగన్ ప్రభుత్వం ప్రోత్సాహం



తణుకులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో జిల్లాస్థాయికి ఎంపికైన ఏకేటీపీ హైస్కూల్ విద్యార్థులతో హెచ్‌ఎం రామకృష్ణ



తణుకులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో జిల్లాస్థాయికి ఎంపికైన జెడ్పీ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులతో హెచ్‌ఎం పద్మావతి

తణుకు అర్బన్: విద్యతోపాటు క్రీడల్లోను ప్రావీణ్యత చూపించాలని, క్రీడలు శారీరకంగా, మానసికంగాను ధృడత్వాన్నిస్తాయని అనేది వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రముఖుల నానుడి. మంచి విద్యతో పాటు మెరుగైన క్రీడాప్రావీణ్యంతో భవిష్యత్తులో మంచి ఉపాధి కలుగుతుందనేది జగమెరిగిన సత్యం. అందుకు తగ్గట్లుగా విద్యార్థులు సైతం ఇటీవల కాలంలో క్రీడలపట్ల ఆసక్తి చూపిస్తున్నారు. గత జగన్ ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల ద్వారా విద్యార్థులకు క్రీడలపట్ల ఆసక్తి పెంచేందుకు దోహదపడింది. క్రీడాకారులకు క్రీడా పరికరాలు, దుస్తులు, వసతులు కల్పించి విజేతలకు నగదు బహుమతులు అందించి విద్యార్థి దశలో క్రీడలు తప్పనిసరి అనేట్లుగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడాపోటీలు కూడా విద్యార్థుల క్రీడాప్రావీణ్యాన్ని తెలియజేసేలా ఉంది. తణుకు నియోజకవర్గంలోని తణుకు మునిసిపాలిటీతోపాటు, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి ఎస్‌జీఎఫ్ క్రీడల్లో అథ్లెటిక్స్‌మిగిలిన అన్ని విభాగాల్లోను 560 మంది క్రీడాకారులు పాల్గొనగా 120 మంది జిల్లాస్థాయికి ఎంపికైనట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

ఈనెల 15 నుంచి ఎస్‌జీఎఫ్ గేమ్స్..

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఈనెల 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, హైజంప్, ఖోఖో, యోగ, ఫుట్‌బాల్, స్విమ్మింగ్, బ్యాడ్మింటన్ క్రీడల్లో మండలస్థాయి, నియోజకవర్గస్థాయి పోటీలు పూర్తై క్రీడాకారులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయికి, జాతీయస్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించాల్సి ఉంది. ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

జిల్లా స్థాయికి ఎంపికయ్యారు



ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి పైస్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేస్తున్నాం. క్రీడల్లో విద్యార్థులు ప్రదర్శిస్తున్న తీరు ఆలోచింపచేసే విధంగా ఉంది. క్రీడలపట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెరగడమే కాకుండా పూర్తి అవగాహనతో ఉన్నారు. 120 మంది విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికయ్యారు.

– సంకు సూర్యనారాయణ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తణుకు నియోజకవర్గ కోఆర్డినేటర్

మంచి ప్రదర్శన ఇచ్చాం



తణుకు ఏకేటీపీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఖోఖో, వాలీబాల్, యోగ, బ్యాడ్మింటన్ పోటీల్లో 16 మంది జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. మండల స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో విద్యార్థులు మంచి ప్రదర్శన చేసి జిల్లాస్థాయికి ఎంపికకావడం సంతోషంగా ఉంది.

– టి.రామకృష్ణ, తణుకు ఏకేటీపీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం

ఎస్ఐ కావాలని ఆశపడుతున్నాను



మండపాక జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాను. ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల ఎంపికలో మండల, నియోజకవర్గ స్థాయిలో చూపిన ప్రతిభ ద్వారా జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాను. కబడ్డీలో మరింత ప్రతిభ చూపి భవిష్యత్తులో ఎస్ఐ కావాలని ఆశపడుతున్నాను.

– బి.భార్గవ్, మండపాక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి

క్లుప్తంగా

దివ్యాంగుల పిల్లలకు బహుమతుల పంపిణీ



బహుమతుల ప్రదానోత్సవం దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక సుబ్బారావుపేటలోని దివ్యాంగుల పాఠశాలలో అంతర్జాతీయ బధిరుల వారోత్సవాలు సందర్భంగా డాక్టర్ నార్ని రత్నాలయ కుమారి చారిటబుల్ ట్రస్ట్, లయన్స్‌క్లబ్ ఆఫ్ స్పిరిట్ ఆధ్వర్యంలో దివ్యాంగుల పిల్లలకు క్రీడా పోటీలు నిర్వహించి గురువారం బహుమతులు అందజేశారు. వక్తలు మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలను ప్రత్యేకంగా చూడవద్దని, మేనరిక వివాహాలను ప్రోత్సహించకూడదని, తదితర విషయాలను చర్చించారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో వైద్యులు నార్ని భావాజీ, భవిత సెంటర్ నిర్వాహకులు ఎస్‌కే బాలీశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, ఎంకేఎస్ సుందర్, తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళకు డయాలసిస్

తణుకు: కిడ్నీ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న తణుకు శివారు మురికివాడలో నివసిస్తున్న పి.భవాని అనే పేద మహిళకు ఉందుర్తి పాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డయాలసిస్ చికిత్స చేస్తున్నారు. రాజమండ్రిలోని ప్రైవేటు ఆస్పత్రిలో ఈ మేరకు ఫౌండేషన్ ఛైర్మన్ ఉందుర్తి ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో చికిత్స ప్రారంభించారు. ఈ మేరకు పైడిపర్రు, తేతలి లయన్స్ క్లబ్ తరపున రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నేకూరి తరుణ్, తలపాక అఖిల్, దున్నా, అమర్‌బాబు, విప్పర్తి చెర్రి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సొమ్ములు 48 గంటల్లో జమ చేస్తాం

తాడేపల్లిగూడెం రూరల్: రైతులు ధాన్యం విక్రయించిన 48 గంటల్లో వారి ఖాతాల్లోకి సొమ్ములు వేసే బాధ్యత సీఎం చంద్రబాబు, మంత్రి నాదెండ్ల మనోహర్ తీసుకున్నారని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని రామన్నగూడెం గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం'కార్యక్రమం నిర్వహించారు. వలవల మల్లిఖార్జునరావు (బాబ్జీ), సర్పంచ్ చింతా వెంకట్రావు, మాజీ ఎంపీపీ పరిమి రవికుమార్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, మండల ఉద్యా న శాఖ అధికారిణి శ్రీలక్ష్మి, పంచాయతీ డీడీవో రవిచంద్ర, పంచాయతీ కార్యదర్శి వేణు, పాల్గొన్నారు.

పెంటపాడు: మండలంలోని యానాలపల్లి, ఉమామహేశ్వరం, గ్రామాల్లో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ గురువారం పర్యటించారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

అత్తిలి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచ డం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం నెలకొంటుందని సర్పంచ్ కసిరెడ్డి బాలలక్ష్మీనారాయణ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు పచ్చదనంతో నిండి ఉండాలన్నారు. సెక్రటరీ పి మనోజ్‌కుమార్, స్థానిక నాయకులు ఆచంట సుబ్బారావు, గారపాటి బాబ్జి, ఆకుల రామచంద్రరావు, కసిరెడ్డి అప్పారావు, తోట గణేష్, గారపాటి అశోక్, తలారి మణికుమార్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చిలకమర్తి జయంతి

తణుకు టౌన్: తెలుగు సాహిత్యంలో అనేక రచనలు చేసి, సమాజంలోని స్త్రీ విద్య, వితంతు వివాహాలు, అంటరాని వారి దేవాలయాల ప్రవేశం కోసం కృషి చేసిన మహనీయుడు చిలకమర్తి లక్ష్మీనరసింహం అని తణుకు సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు చెప్పారు. గురువారం చిలకమర్తి లక్ష్మీనరసింహం జయంతిని తణుకులో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చిలకమర్తి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వారు గర్వించదగ్గ గొప్ప సంఘ సంస్కర్త చిలకమర్తి అని కొనియాడారు. అనంతరం తెలుగు అధ్యాపకురాలు ఎస్‌కే నాగమణిని సత్కరించారు. ఈకార్యక్రమంలో మద్దాల త్రీస్ మూర్తి, జీ శ్రీనివాసరెడ్డి, కే సత్యనారాయణ, టీ మంగారావు, ఏ ధనరాజు, ప్రసాద్, ఆలంగీర్ బాషా, ఎం మోహనరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోటారుసైకిల్ చోరీపై కేసు నమోదు

అత్తిలి: మోటారుసైకిల్ చోరీపై కేసు నమోదు చేసినట్లు అత్తిలి ఎస్సై పి ప్రేమ్‌రాజ్ గురువారం తెలిపారు. వివరాల ప్రకారం కంచుమర్రు గ్రామంలో రొయ్యల చెరువుమీద ఈడూరు గ్రామానికి చెందిన నంద్యాల రాంబాబు పనిచేస్తున్నాడు. ఈనెల 17వ తేదీ రాత్రి చెరువు పక్కన మోటారుసైకిల్‌ను పార్కుచేసి చెరువుమీద కాపలాకు వెళ్లాడు. తెల్లవారుజామున తిరిగి వచ్చేసరికి మోటారుసైకిల్ కనిపించలేదు. దీనిపై బాధితుడు రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమ్‌రాజ్ తెలిపారు.

ముమ్మరంగా మూడో పంటకు ఏర్పాట్లు



పుల్లాయగూడెం గ్రామంలో వరి చేలను దుక్కి దున్నుతున్న దృశ్యం



ఎల్.అగ్రహారంలో మొక్క దశకు చేరుకున్న మినుము పంట

తాడేపల్లిగూడెం రూరల్: ఖరీఫ్ పంట సాగు పూర్తి కావడంతో రైతాంగం మూడో పంటకు సిద్ధమవుతున్నారు. మెట్ట ప్రాంత మండలం, బోర్లపై సాగు కావడంతో ఖరీఫ్ సీజన్‌ను ముందస్తుగానే సాగు చేశారు. దీంతో సెప్టెంబరు చివరి వారానికి వరి కోతలు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో రైతులు మూడో పంట సాగుకు దుక్కి దున్ని చేలను సిద్ధం చేస్తున్నారు. మూడో పంటగా ఆరుతడి పంటలైన మినుము, పెసర పంటలను వేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. గత నెలలోనే వరి పంట చేతికొచ్చిన రైతులు ఇప్పటికే మినుము, పెసర విత్తనాలను వేయగా, ప్రస్తుతం ఎల్.అగ్రహారం, పుల్లాయగూడెం, అప్పారావుపేట, కృష్ణాయపాలెం గ్రామాల్లో మొక్క దశలో ఉన్నాయి. అప్పారావుపేట, మోదుగ గుంట, మాధవరం, వెంకట్రామన్నగూడెం, మెట్ట ఉప్పరగూడెం, నీలాద్రిపురం, కొమ్ముగూడెం, పట్టింపాలెం, వీరంపాలెం, బంగారుగూడెం గ్రామాల్లో రైతులు గత రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు మాగ దున్ని దమ్ములు చేస్తున్నారు.రైతాంగం బిజీబిజీగా ఉన్నారు.

కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలి



పెంటపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కౌలు రైతు సంఘాల నాయకులు

పెంటపాడు: కౌలురైతుల సమస్యలను కూటమి ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఏపీ రైతుసంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ల పుల్లారెడ్డి, సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు శిరపరపు రంగారావుల ఆధ్వర్యంలో కౌలురైతులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కర్రి సాయిరెడ్డి, పెనగంటి దుర్గ, యాండ్రపు కృష్ణ, సత్తి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరెడ్డి, బుచ్చిబాబు, గొర్ల రమేష్, కొల్లి రామకృష్ణ, ఆదిరెడ్డి రాజేష్, మద్దాల ప్రభాకర్, మహంకాళి పాపారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ఇరగవరం: రేలంగి టిఎం జెడ్పీహెచ్ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో నియోజకవర్గ స్థాయిలో సత్తా చాటి జిల్లా స్థాయి క్రీడలకు సుమారు 19 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎస్ శ్రీనివాస్, వ్యాయమ ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, ప్రసాద్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ పోటీల్లో జగన్నాథపురం విద్యార్థుల ప్రతిభ



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీల్లో జిల్లా స్థాయికి ఎంపికైన జగన్నాథపురం జెడ్పీహెచ్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) పోటీల్లో ప్రతిభకనబర్చి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం ఎ.నాగేశ్వరరావు గురువారం తెలిపారు. అండర్–17 చెస్ పోటీల్లో సీహెచ్.కాశీ నాగదుర్గాదేవి, టి.అభిజ్ఞ, పి.మేఘన, యోగాపోటీల్లో ఎం. సందీప్, అథ్లెటిక్స్ పోటీల్లో ఎం.లోకేష్ ఎంపికైనట్లు వివరించారు. చెస్‌పోటీల్లో మొత్తం 25మంది పాల్గొనగా, ప్రథమ, ద్వితీయ, 5వ స్థానాలను తమ విద్యార్థులు కైవసం చేసుకున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక, ఎమ్పీటీసీ నార్ని రవికాంత నాగేశ్వరరావు (నాగులు), ఎస్ఎంసీ ఛైర్మన్ అరిగెల వెంకటకృష్ణ, వ్యాయామోపాధ్యాయుడు కట్టా వెంకటేశ్వరరావు, డ్రా యింగ్ ఉపాధ్యాయుడు లక్ష్మణ్, ఉపాధ్యాయ సిబ్బంది, అభినందించారు.

కారు అమ్ముతానని రూ.3 లక్షలకు టోకరా

తాడేపల్లిగూడెం అర్బన్ : కారు విక్రయానికి పెట్టి రూ.3 లక్షలకు ఓ న్యాయవాది టోకరా వేసినట్టు సమాచారం. వివరాల ప్రకారం తాడేపల్లిగూడెంకు చెందిన ఓ న్యాయవాది తన కారును ఆన్‌లైన్ ఓఎల్ఎక్స్‌లో అమ్మకానికి కారు ఫొటోతో వివరాలు తెలియచేశాడు. తూర్పుగోదావరి జిల్లా మండపేటకు చెందిన ఓ వ్యక్తి ఓఎల్ఎక్స్‌లో ఆ కారును చూసి తాడేపల్లిగూడెం వచ్చి కారు యజమానితో చర్చించి రూ.3 లక్షలు అడ్వాన్సు ఇచ్చాడు. ఆ తరువాత రోజు మిగిలిన సొమ్ములు చెల్లించేందుకు రాగా అక్కడ కారు లేదు. దీంతో యజమానిని అడుగగా తన స్నేహితులు కారులో విజయవాడ వెళ్లారని తరువాత రోజు ఉదయం వస్తారని చెప్పాడు. దీంతో మండపేట వాసి వెళ్లి మూడవ రోజు వచ్చాడు. తన స్నేహితులు ఇంకా రాలేదని తరువాత రోజు వస్తారని చెప్పాడు. ఇదే విషయాన్ని పలుమార్లు చెప్పడంతో తాను మోసపోయానని మండపేట వాసి గ్రహించి తాడేపల్లిగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పట్టణ పోలీసులు ఇద్దరినీ పిలిచి సంధి చేసినట్లు తెలిసింది.

కార్యకర్తలకు జగనన్న కొండంత అండ

ఏపీ అప్సడా మాజీ వైస్ ఛైర్మన్ రఘురాం



కార్యకర్తలతో మాట్లాడుతున్న వడ్డి రఘురాం

పెంటపాడు: కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు జగనన్న కొండంత అండగా ఉంటారని మాజీ ఏపీ అప్సడా వైస్ ఛైర్మన్ వడ్డి రఘురాం పేర్కొన్నారు. గురువారం ఆయన పెంటపాడు మండలంలో రామచంద్రపురం, మీనవిల్లూరు, కొండేపాడు, కోరిమిల్లి, చింతపల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల కార్యకర్తలతో సమావేశమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రామచంద్రపురం గ్రామంలో అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న గ్రామ మాజీ సర్పంచ్ చల్లా కుమారస్వామి భార్య బేబీని, మీనవిల్లూరు గ్రామానికి చెందిన పార్టీ నాయకులు చింతపల్లి శ్రీనివాస్ తల్లి ఇటీవల మృతి చెందడంతో ఆ కుటంబాన్ని వడ్డి రఘురాం పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో ప్రజలు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్లక్ష్యం వల్లే ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రజలంతా వైఎస్సార్ సీపీ పార్టీపై సానుభూతితో ఉన్నారన్న అక్కసుతో చంద్రబాబు ప్రజా పాలన గాలికి వదిలేసి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడమే ధ్యేయంగా పెట్టుకున్నారన్నారు. కానీ జగనన్నను ప్రజల నుంచి, కార్యకర్తల నుంచి ఎవరూ, ఎప్పుడూ దూరం చేయలేరన్నారు. ప్రతి కార్యకర్త జగనన్నకు అండగా ఉందామన్నారు. గూడెం జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ఆంజనేయులు, గూడెం ఎంపీపీ శేషులత, గూడెం మండల సర్పంచ్‌లు ఎలిపే గాంధీ, లక్ష్మణరావు, మార్లపూడి సుబ్బారావు, పెంటపాడు మండల నాయకులు పాలా గణపతి, దేవరశెట్టి సత్యనారాయణ, రాంబాబు, గూడూరి సూర్యనారాయణ, వీరవల్లి సూర్యనారాయణ, బండారు అప్పన్న, మెంబర్ రాంబాబు విద్యార్థి విభాగం నాయకులు చిన్నం సురేష్, దాట్ల రామలింగరాజు, ముదునూరి జయరామరాజు, భరత్‌కుమార్‌రాజు, సోషల్ మీడియా ఉర్ల నవీన్, వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు నల్లమిల్లి విజయానందరెడ్డి, డి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసాదరాజును కలిసిన గూడెం నాయకులు



ముదునూరి ప్రసాదరాజుకు అభినందనలు తెలుపుతున్న తాడేపల్లిగూడెం వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్ : వైఎస్సార్ సీపీ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన ముదునూరు ప్రసాదరాజును తాడేపల్లిగూడెం నియోజకవర్గ నాయకులు గురువారం కలిసి అభినందనలు తెలిపారు. నరసాపురంలో ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ప్రసాదరాజును కలిసిన వారిలో ముప్పిడి సంపత్‌కుమార్, కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, కైగాల శ్రీనివాస్, గుండుమోగుల సాంబయ్య, బంగారు నాగు, చెన్నా జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై శ్రద్ధ చూపాలి

ఇరగవరం: గ్రామాల్లో పారిశుద్ధ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పశ్చిమ గోదావరి జిల్లా వైద్యాధికారి డాక్టర్ డి మహేశ్వరరావు అన్నారు. గురువారం ఇరగవరం పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్, రోగులు వార్డుల్లో శానిటేషన్ సరిగా లేదన్నారు. సిబ్బంది పనితీరుపై అగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, హెల్త్ సూపర్ వైజర్ మూర్తి, ఎంపీహెచ్‌వో సురేష్, ఎల్‌టి ప్రసాద్, స్టాఫ్ నర్సు జ్యోతి, లలిత కుమారి పాల్గొన్నారు.

ప్రముఖ వైద్యుడు పూరేటి రామ్మోహన్‌రావు మృతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని కొబ్బరితోటకు చెందిన ప్రముఖ, సీనియర్ వైద్యులు పూరేటి రామ్మోహన్‌రావు తీవ్ర అస్వస్థత గురువారం మృతి చెందారు. ఐదు దశాబ్దాల పాటు పట్టణ, తాలూకా పరిధిలోని ప్రజలకు విశేష వైద్య సేవలు అందజేశారు. రామ్మోహన్‌రావు కోరిక మేరకు పార్థీవ దేహాన్ని ఏలూరు ఆశ్రమ ఆస్పత్రికి రీసెర్చ్ కోసం అందజేయనున్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యులు సంతాపం తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని వన్ టౌన్‌లో హౌసింగ్‌బోర్డు, కొండయ్యచెరువు, పాతూరు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు నిమిత్తం ఈ నెల 27వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. వన్ టౌన్‌లోని అన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



ఇంజనీరింగ్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న హౌసింగ్ ఏఈ వెంకట్రావు

తాడేపల్లిగూడెం రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో భాగంగా గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ వైవీ. వెంకట్రావు అన్నారు. గురువారం మండలంలోని 23 గ్రామ సచివాలయాల వద్ద ఇంజనీరింగ్ సిబ్బందితో 'మన ఇల్లు – మన గౌరవం' సమావేశం నిర్వహించారు. మన ఇల్లు – మన గౌరవం కార్యక్రమానికి సంబంధించి ఆయా గ్రామాలకు ఇన్‌ఛార్జీలను నియమించారు. దీనిలో భాగంగా అప్పారావుపేట, మోదుగ గుంట గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో హౌసింగ్ ఏఈ వెంకట్రావు మాట్లాడుతూ మండలంలో 647మంది గృహ నిర్మాణ లబ్ధిదారులు ఉన్నారని, ఇంటి నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఈక్రమంలో లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 28వ తేదిన లేఅవుట్ వద్ద సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతీ లబ్ధిదారుడు ఇంటి నిర్మాణాలను చేపట్టే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, ఉద్యాన వన శాఖాధికారి శ్రీలక్ష్మి, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్ర సాద్, ఎస్. శివశంకర్, పి. రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ఆవరణను పొడిగా ఉంచుకోవాలి



గురుకుల పాఠశాల విద్యార్థులకు జ్వరాలపై అవగాహన కల్పిస్తున్న లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం రూరల్: ఇంటి ఆవరణను పొడిగా ఉంచుకోవాలని, తద్వారా వ్యాధులు దరి చేరవని తాడపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. గురువారం మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలో వెక్టార్ కంట్రోల్, హైజీన్ కార్యక్రమాలను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం స్థానిక డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సాంఘీక, సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు జ్వరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమలను అరికట్టడం ద్వారా వ్యాధుల నుంచి ప్రజల్ని సంరక్షించవచ్చన్నారు. సాధారణజ్వరాలు మూడ్రోజుల్లో తగ్గిపోతాయని, వైరల్ జ్వరాలు శరీరంలోని రక్షణ శక్తిని నిర్వీర్యం చేస్తాయన్నారు. జ్వరాల పట్ల కనీస అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశాలు జ్యోతి, లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ ప్రవల్లిక, ఆరోగ్య సహాయకులు కాంతారావు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలో డిపాజిట్లు ఇప్పించాలి

తణుకు టౌన్: మండలం తేతలి సొసైటీలో రైతులకు డిపాజిట్లు ఇప్పించాలని సొసైటీలోని రైతులు పర్సన్ ఇన్‌చార్జి, ఆడిటర్ కె రామలక్ష్మిని కోరారు. గురువారం తణుకు రూరల్ మండలం తేతలి సొసైటీలో జరిగిన సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ భూమి పత్రాలు సొసైటీలో ఉండిపోవడం వలన తమ భూములు అమ్ముకోలేకపోతున్నామని, దీని వలన తమ పిల్లల ఉన్నత చదువులు మధ్యలోనే ఆగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సొసైటీలో రైతులకు సంబంధించిన డిపాజిట్లు, రుణాలకు సంబంధించిన వాటిపై గతంలోనే విచారణలో ఉన్న కారణంగా వీటిపై తాను ఏమీ చేయలేనని పేర్కొన్నారు. గతంలో మాదిరిగా సొసైటీ ఆదాయాలను పెంచుకోవాలన్నారు.

మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యం

తణుకు టౌన్: మంచి ఆహారంతో పాటు శరీరానికి తగినంత వ్యాయామం ఉంటే గుండె జబ్బులు దరి చేరవని ప్రముఖ గుండె సంబంధిత వైద్యులు డాక్టర్ యూ వెంకటేష్ తెలిపారు.ఈ కార్యక్రమం రోటరీ అధ్యక్షుడు ఆనంద్ మస్తానరావు ఆధ్వర్యంలో జరిగింది. గురువారం రాత్రి రోటరీ క్లబ్‌లో జరిగిన గుండె వ్యాధులు, నివారణ, జాగ్రత్తలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి కఠారి సిద్దార్థ, అక్కిన కాశీ విశ్వనాథం, నూలి సత్యనారాయణ, జేఎస్ సుబ్రహ్మణ్యం, నందిగం సుధాకర్, గమిని రాంబాబు పాల్గొన్నారు.